

# టేకిట్ ఈజీ!!

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

# పెళ్ళినాటి ప్రణామాలు

**ఈ రోజు మనసెందుకో** పెళ్ళిమీదకి పోతోంది. పెళ్ళంటే కొత్తగా పెళ్ళి కాదు, అయిపోయిన పెళ్ళీ, అసలు పెళ్ళీని. ఇప్పుడు తలుచుకుంటే ఇన్నేళ్ళయిపోయిందని నవ్వొస్తుంది కానీ, అప్పుడు భయపడి చచ్చేవాణ్ణి పెళ్ళంటే. అసలీ లోకంలో మగాడిగా పుట్టటం కంటే డిఫికల్ట్ పని ఏవిటో తెలుసా? ఆడవాళ్ళని పెళ్ళి చేసుకోడం ( ఒఖ్ఖళ్ళనే ). ఈ విషయం మనకి అనుభవపూర్వకంగా తెలిసేడిసింది కాబట్టి అథారిటీగా చెప్పగలను. " ***అసలు మనకేంటి మనం నూటొక్క జిల్లాలకీ, రాబోయే రాష్ట్రాలతో కలిపి అరవై రెండు రాష్ట్రాలకి అందగాళ్ళవని*** "మా మామ్మ సర్టిఫికెట్టిచ్చేస్తే, అయాం బాబుగారు కాలరెగరేసి, ఇలా ఇండియా వెళ్ళడం, అలా పిల్లని చేసుకుని అలా, అలా గాల్లో అమిరికా తీసుకొచ్చేయడం అని ఓ.... తెగ డ్రీమింగులు చేహేసుకున్నాంగానీ, బేగం కోసం బేగంపేటలో దిగాకా తెలిసింది, అంత దృశ్యం లేదని.

సరిగ్గా వారం రోజులు సెలవిచ్చాడు మా ముష్టి వెధవ, మళ్ళీ వచ్చే నాలుగు అవతారాల్లాలోనూ ఓవర్ టైము చేస్తానని ఒట్టేయించుకుని. తొల్నాటి సాయంత్రం మొదటమ్మాయింటికెళ్ళాం. వాళ్ళేదో టిఫినీలు చేస్తారు, **"మా పిల్లే చేసిందండి"** అని సిగ్గుపడుతూ చెబుతారు అని ఏవేవో ఫీలింగయిపోయి, పోలో చొక్కా, పోలో పాంటూ, పోలో లో దుస్తులూ, పోలో సాక్సులూ **(రెండూ పోలోవే)**, పోలో సెంటూ ధరించి, పోలోమని బయల్దేరెళ్ళి ఎంట్రీ ఇచ్చా, సకుటుంబ సపరివార, బంధుమిత్ర సమేతంగా. చూడగానే ఓ ముసిలాయన తలుపుతీసి **" వినాయకచవితి ఇంకా రెణ్ణెల్లుంది, ఇప్పట్నించీ, చందాలివ్వం"** అని తలుపేసేసాడు. నాకొళ్ళు మండి, బెల్లు నొక్కి, తలుపు తీసిన శాల్తీని తోసుకుని లోపలికి ప్రవేశించాను, చేతిలో **కల్యాణ రోగాలు**, ఐ మీన్ రాగాలు, పేపర్ కటింగ్ పట్టుకుని ! ఇంతలో ఇంటావిడ వచ్చి, గుర్తుపట్టి, **"అయ్యో, మీరా అన్నయ్యగారూ, ఇందాకా ఫోను చేసారుకదూ, మర్చేపోయాను, రండి..రండి"** అంటూంటే ఆపి **" అన్నయ్యగారూ, వదినగారూ అండ్ కంపెనీ వెనకాలున్నారు, నేను వారి కొడుకయ్య గారిని"** అని చెప్పి, ఆవిడ బుగ్గమీదో చిన్న చిటికేసి, వెళ్ళి **మీ నాన్నగారుంటే పిలవండని** చెప్పాను, ఎందుకైనా మంచిదని.

ఆవిడ టీవీ సీరియల్ లా వంద మెలికలు తిరిగిపోయి.."అయ్యో..నేను కాదండీ, మా అమ్మాయి పెళ్ళి కూతురు, ఉండండి, మా "వా"రిని పిలుస్తాను.." అంటూ సిగ్గులమొగ్గ అయిపోయి లోపలికి పారిపోయింది. ఈవిడ వెళ్ళి చెబితేనేగానీ, బైటికొచ్చి మొహం చూపించలేని ఆయన వినయ విధేయతలకి , చెప్పకపోడవే, ముచ్చటేసింది.

సరే, అమ్మాయి నన్ను చూడ్డం పూర్తయ్యింది. నేను చాలా ప్రయత్నించి సగమే చూడగలిగాను, మిగిలిన సగం ఇంకోసారి చూద్దాంలే అని, కాస్త కళ్ళకి విశ్రాంతి ఇస్తూ, కాఫీ కానిచ్చాను. అప్పుడొచ్చింది ఇందాకా తలుపు తీసిన కారెక్టరు.

"ఏం చదువుకున్నావు?"

"కంప్యూటరండి" అన్నాను, ఆయనకి అర్థమయ్యేట్టుగా.

" అది ఇంజనీరా? డాక్టరా? " అడిగాడాయన.

"అంటే, ఇద్దరూ వాడచ్చండి, అవసరాన్ని బట్టి.." అన్నాన్నేను.

"అది నాకనవసరం, నువ్వు డాక్టరా? ఇంజనీరా?" కొట్టినట్టడిగాడాయన.

"ఏదీ కాదండి" అన్నాన్నేను.

అంతే, ఆయన ఒక్కసారి సంపూర్ణరామాయణంలో ముక్కామలలా మొహం పెట్టి, " ఎవరు? నా మనవరాలికి ఈ "డిస్కులో తిష్కుతపా" సంబంధం తెచ్చిందెవరు?" అంటూ

ఆవేశపడిపోయాడు, గొడ్డలికోసం వెతుకుతూ. ఎందుకేనా మంచిదని నేను లేవబోయాను.

అంతలో వాళ్ళ అబ్బాయి వచ్చి, " ఇంతకీ అక్కడ నీ డెసిగ్నేషన్ ఏవిటోయ్.." అన్నాడు అనుమానంగా.

" అంటే ప్రోగ్రామర్ ఎనలిస్ట్ వన్ అంటారండి" అన్నాన్నేను మెల్లిగా.

ఆయన వెంఠనే వంటింటోకి పరిగెత్తుకెళ్ళి, చెంబులో పసుపునీళ్ళు తెచ్చి, నామీద చిలకరించి,

" తప్పమ్మా, ఇక్కడంతా పెద్దాళ్ళం వున్నాం కదా, బూతులు మాట్లాడకూడదు, సరేనా.. " అంటూంటే, ఇందాకటి ముసిలాయనకి గొడ్డలి దొరికేసింది. మేమంతా ఆ శాల్తీలకో ప్రణామం చేసి, మరునిమిషంలో జంపు జగన్నాథం.

ఇంటికొచ్చాకా నాన్నడిగారు, "అదేం దిక్కుమాలిన డెజిగ్నేషనా నాయనా, అసలు నువ్వేంచేస్తావక్కడ?" అని.

" అంటే..పొద్దున్న ఆరున్నరకి ఓ జానీటరు వచ్చి రూము శుభ్రం చేసి వెడతాడు, ఏడింటికి నేనెళ్ళి, కోడింగు మొదలెడతాను. మా ముష్టివెధవ వచ్చి రోజుకో లాంగ్వేజి పేరు చెబుతాడు, అవన్నీ అరగంటలో నేర్చుకుని వాటిల్లో కోడింగు చేసేస్తాను. మధ్యలో వాడి వీపు దురదపెడితే గోకుతాను. ముక్కు తుడుస్తాను, వాడికి పూజా సామాగ్రి సిద్ధంచేసి పెడతాను, వాడి బనీన్లు విస్త్రీ చేసిపెడతాను. " నాన్న ఇంక తట్టుకోలేక "ఎందుకీ కుక్క చాకిరీ? ఆ పచ్చకార్డు కోసవేనా? పోతే పోయింది, నేన్నిన్ను పోషిస్తాగానీ, హాయిగా వచ్చేయ్, వెధవ్వుద్యోగాలూ నువ్వూ. " అనేసారు.

నేను అలిగి అన్నం మానేస్తే, " సర్లే, చేస్తే చేసావు గానీ ఎవరికీ చెప్పేడవకు, ఏదో ప్రాజెక్టు మేనేజర్నను, లేకపోతే పిల్లనివ్వరు" అని సూక్ష్మం చెప్పారు.

మర్నాడు మరో ఇంట్లో . "బాబూ, నువ్వెక్కడా పనిచేస్తుంట?" అడిగింది, ఒకవేళ పెళ్ళయితే.. అవ్వాల్సిన అత్తగారి అత్తగారు.

"అమెరికాలోనండి" అన్నాను వినయంగా.

"అది సరేరా, ఏ రాష్ట్రంలో?" .

(ఇదేటిది, ఈవిడ మరీ ఫ్రీ అయిపోతోంది?) *అబ్బో ఈవిడకి రా..ష్ట్రా..లు కూడా తెలుసన్నమాట* అనుకుంటూ..."జార్జియా లో అండి " అన్నాను గెట్టిగా.

" ఏం? ఫ్లొరిడాలో దొరకలేదా? అక్కడైతే స్టేట్ టాక్సు ఉండవుకదా? "

(అజ్జీ...బా..బో..య్, హమ్మ ముసిలిదోయ్..)

"అంటే, నాకు మొదట్నించీ జార్జియాలోనే అలవాటైపోయిందండి.."

"సర్లే, వెధవది, అలవాట్లకేంగానీ, ఎక్కడా బాగుపడే లక్షణాలేవీ కనబట్టంలేదు. ఇంతకీ నీ కారెట్టు మంచిదేనా? " నాకర్థంకాలేదు.

" పిల్లనిచ్చేవాళ్ళం కదా, మా భయాలు మాకుంటాయి, ఆ మధ్యనో అడ్డకాళ్ళ వాడొచ్చాడు పిల్లని చూడ్డానికి, ఆనక తెలిసింది, వాడి కారెట్టు మంచిది కాదని, వాడికి అప్పుడే రెండు పెళ్ళిళ్ళయ్యి, నాలుగు లంపటాలున్నాయిట. "

ఇంక ఆవిడ దిక్కుమాలిన కారెట్టు గోల పడలేక " దుర్ముహూర్తం వచ్చేస్తోంది, అమ్మాయిని మళ్ళీ చూస్తాం " అని జంపైపోయాం, ఆవిడకో ప్రణామం చేసేసి.

ముచ్చటగా మూడో రోజు మరో అపార్ట్‌మెంట్లో. నేనెంత తెలుగులో మాట్లాడితే వాళ్ళంత ఇంగ్లీషులో రెచ్చిపోతున్నారు, ముఖ్యంగా ఇంటాయన. "వెల్ బోయ్, వాట్ కంపెనీ ఆర్ యు ఎటాచ్డ్ విత్ ?".

" అబ్బే, నాకలాంటి ఎటాచ్ మెంట్లేవీ లేవండి, జస్ట్ డబ్బులిస్తున్నాడు కాబట్టి చేస్తున్నాను" మెల్లిగా చెప్పాను.

"వో..కే..మై డాటర్ వర్క్స్ ఫర్ యె మల్టీనేషనల్ కంపెనీ.."

ఏవనాలో తెలియక తలూపాను. "షి వర్క్స్ ఏజ్ ఎ కాల్ గర్ల్.." నాగుండె రెండు సెకన్లు రెస్టు తీసుకుని లబో దిబోమని కొట్టుకోడం మొదలెట్టింది.. ఆయన ఎక్కడా ఆగట్లేదు.

" దే రీసెంట్లీ బిల్ట్ కాల్ సెంటర్, హియర్ ఓన్లీ, టేక్ లెఫ్ట్ ఫ్రం మెయిన్ రోడ్ , గో ఎగ్జాక్లీ టూ పాయింట్ వన్ కిలోమీటర్స్ అండ్ ఆన్ ద రైట్ సైడ్, బిహైండ్ హీరోహోండా షోరూం. షి గోస్ ఇన్ కార్ నైన్ పి.ఎం. కంస్ బేక్ షార్ప్ ఫైవ్ ఎ.ఎం. వెరీ హార్డ్ వర్కింగ్. ఆఫ్ కోర్స్, సేఫ్టీ వైజ్ నో ఇష్యూస్. దేర్ ఆర్ ఎబౌట్ హండ్రెడ్ కాల్ గర్ల్స్ దేర్. ఆఫ్టర్ హెర్ స్టడీస్, ఐ థాట్ మైసెల్ఫ్.. ఫర్ నౌ, ఐ వర్క్ హెర్, వెన్ సూటబుల్ బోయ్ కంస్, ఐ మేరీ హెర్.. "

ఇంక నావల్లకాలేదు, ఆయనకో సాష్టాంగ ప్రణామం చేసి బైటపడ్డా.

ఇంక మిగిలిన రెండు రోజుల్లోనూ ఎల్లాగూ పెళ్ళి కుదరదని డిసైడ్‌మెంటయిపోయి, తిండి మీద శ్రద్ధవహిస్తున్న సమయంలో, ముందో ఫోను కాలొచ్చింది. తరవాతొకాయన వచ్చారు.

" మొత్తం బేక్‌గ్రౌండు వర్కంతా చేసుకునొచ్చాను. జాతకాల్లో 30 పాయింట్లొచ్చాయి, హైటు సరిపోతుంది, ఆల్‌రెడీ మీ ఇంటిపేరువాళ్ళు మాఇంటిపేరు వాళ్ళని చేసుకున్న సందర్భాలన్నీ తేదీలవారీగా ఈ డైరీలో ఉన్నాయి. మీ కుఱ్ఱాడు బంగారం, మా పిల్ల ప్లాటినం. మా అబ్బాయి ఫ్రెండుంటాడు అట్లాంటాలో. అక్కడ జరిగిన వాడి పెళ్ళి రిసెప్షన్ వీడియో మా వాడికి పంపాడు. అది మా పిల్ల కూడా చూసింది. దాన్లో మీ కుఱ్ఱాడు పాడిన పాట కోసం, మాకు తెలీకుండా మా పిల్ల చాలా సార్లు చూసిందని, మా ఆవిడ చెప్పింది. అడగ్గా అడగ్గా మా పిల్ల కూడా ఆ విషయం ఒప్పేసుకుంది. ఇహ మీ కుఱ్ఱాడు కూడా ఇక్కడ జరిగిన మా అబ్బాయి ఫ్రెండు పెళ్ళిఫోటోల్లో మా పిల్లని చూసాట్ట. చూస్తూ, చూస్తూ ఓ ఫొటో నొక్కేసాడని కూడా తెలిసింది. కాబట్టి మీరోమాటు ఆలోచించుకుని, కుఱ్ఱాణ్ణికూడా కనుక్కుని, ఏవిషయం మరో గంటలో చెబితే, నాలుగింటికి తాంబూలాలు పుచ్చేసుకోవచ్చు. మా పిల్లా, ఆవిడ, ఇతర్రత్రా బంధువర్గం, మా సిద్ధాంతి గారూ, అందరం హోటల్లో దిగాం. ఇహ మా పిల్ల గురించి రెండు ముక్కలు. ఏదో బానే

చదువుకుంది మాష్టర్స్ దాకా. మీరు పెడితే తింటుంది, పాడితే వింటుంది.( *వీక్ నెస్ మీద కొట్టడమంటే ఇదే.)* వ్రతాలూ, పూజలూ కాస్త ఎక్కువ. ఇదిగో ఈ రెండూ స్టూడియోలో తీయించిన ఫొటోలు, ఈ రెండూ డాబా మీదా, పెరట్లోనూ వాళ్ళ అన్న తీసిన ఫొటోలు. ఇదిగో మా హొటలు రూం ఫోను నెంబరు. ముఖ్యంగా నాకు నచ్చినవి మీ వంశం, నెలనెలా క్రెడిట్ కార్డు మీద జీరో బేలన్సు మెయింటెయిన్ చేసే మీ కుఱ్ఱాడి ప్లానింగూను. మీ ఫోను కాలు కోసం వెయిట్ చేస్తాను, చెల్లెమ్మా, కాఫీ ఆనక తాగుతాను, కతికితే అతకదు కదా.." అంతే ఆయన మాయం.

జరిగినది రివైండ్ చేసుకుని, పూర్తిగా నేను అర్థంచేసుకునే లోపే నాలుగయిపోవడం, తాంబూలాలుచ్చేసుకోవడం, మళ్ళీ నెలరోజుల్లో నేను వీకెండుకొచ్చి పెళ్ళిచేసేసుకునొచ్చేయడం, తరవాత ఆవిడ వీసాపుచ్చుకొచ్చేయడం, అన్నీ జరిగిపోయాయి.

* * * * * * * *

సరే మళ్ళీ ఇహంలోకొచ్చి చూద్దునా, మా ఆవిడ పట్టు చీర కట్టింది. "ఏవిటీ, ఏవన్నా వ్రతవా. మళ్ళీ?" అన్నాను.

"ఆ, వచ్చే జన్మలో మంచి మొగుడు రావాలనీ.." అంది ఉడికిస్తూ.

"అబ్బో...ఇల్లాంటి వ్రతాలు మగాళ్ళకుండావా?" అన్నాను తిరిగి ఏడిపిస్తూ.

"వుండవు, ఎందుకంటే మగవాళ్ళల్లోనే మంచీ, చెడూ అని వుంటారు. మాలో ఉండరు.."

"అంటే ఆడవాళ్ళకి మంచీ చెడ్డా లేదా? అంతా చెడ్డవాళ్ళేనా?" అన్నాను కొంగు లాగుతూ.

"మీ బుఱ్ఱ మ్యూజియంలో పెట్ట, మేమంతా మంచివాళ్ళవని తాత్పర్యం..." అంది చెవి మెలేస్తూ.

****

*ఈ నెల కథ సమాప్తం*

---

"ఎవడ్రానువ్వు?"

*"అంటే..వుప్పుడు,రెండేళ్ళక్రితం వచ్చినప్పుడు "ఎవడ్రానువ్వు " అని అడిగారు చూడండి, వాణ్ణేనండి."*

"కాపీ జోకులకేంగానీ, కథేంటో చెప్పు.."

*"కథలూ, కబుర్లూ, కాదండి, ఈ సారి కాకరకాయలు.."*

"అబ్బో, పేరేం పెట్టేవేటి?

*"టేకిట్ ఈజీ అండి.."*

"తెలుగు పేరు దొరకలేదా?"

*"అంటే.. స్టయిలు గుంటది కదండి మరి.."*

"ఒర్నీ స్టయిలూడదొబ్బ , ఇంతకీ కితం పుత్తకానికేమాత్రం సంపాదించావేవిటి?"

"మైనస్ ఎనిమిదొందలండి..."

"రూపాయిలే..?"

"డాలర్లండి.."

"ఇంకా తీరలేదా బులపాటం?"

"ఓ పూట అన్నం మానేసి ఆర్టిపండు తినేద్దారని డిసైడయ్యానండి.."

"నిన్నా దేవుడు కూడా బాగుచేయలేడు రా .."

"మరేనండి .."

కాబట్టి ఇందు మూలముగా తెలియజేయున దేమనగా... మీరింతకాలమూ గోళ్ళు కొరుక్కుంటూ చదివిన టేకిటీజీ, ఇకపై పుస్తకముగా తీసుకుని వచ్చుటకు దైవజ్ఞులు నిశ్చయించినారు గాన, కొత్త సమఛ్ఛరములో అపుడో, ఇపుడో, ఎపుడో టేకిటీజీ 24 ఎపిసోడ్ల పుస్తకముగా మీ ముందుకు వచ్చును. మీరు కాపీలు రిజర్వు చేసుకోదలచినచో, మాకు రాయుడి. ఇవియే అనేక శుభలేఖార్థములు. ఈ మెయిలు: ఫణిడొక్కా ఎట్ యాహూ డాట్ కాం.

(ఒహోం ఒహోం హోం ఒహోం ఒహోం...)

**NEW**
Click here to share your comments on this story